క్లుప్తంగా

ఆర్థిక సాయం అందజేత

తాంసి: మండలంలోని హస్నాపూర్ గ్రామానికి చెందిన గాలిపెల్లి గంగమ్మ కుటుంబానికి వసుధ ఫౌండేషన్ తరఫున శనివారం ఆర్థిక సాయం అందజేశారు. వారం రోజుల క్రితం గంగమ్మ ఇల్లు షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైంది. విషయం తెలుసుకున్న సుండికి గ్రామానికి చెందిన భూపతి రెడ్డి వసుధ పౌండేషన్ తరఫున రూ.20 వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో విలాస్ రెడ్డి, సర్పంచ్ నర్సింగ్, మార్కెట్ డైరెక్టర్ చందర్ రెడ్డి, రమేశ్, కర్నేవార్ స్వామి పాల్గొన్నారు.

విద్యారంగానికి ప్రాధాన్యమివ్వాలి

ఎదులాపురం: విద్యారంగానికి అన్ని పార్టీలు ప్రాధాన్యత ఇవ్వాలని పీడీఎస్‌యూ, పీవైఎల్ నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని పీడీఎస్‌యూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో శనివారం మాట్లాడారు. విద్యారంగ అభివృద్ధికి బడ్జెట్లో 20 శాతం నిధులు కేటాయించాలన్నారు. జిల్లాలో ప్రభుత్వ యూనివర్సిటీ, ఇంజినీరింగ్ కళాశాల నెలకొల్పాలని కోరారు.

పరామర్శ

బోథ్: మండలంలోని కౌఠ(బి) గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ గడ్డం రమణ తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎంపీపీ తుల శ్రీనివాస్ శనివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట సర్పంచుల సంఘం అధ్యక్షుడు బండారి శ్రీధర్ రెడ్డి, స్వామి, రమేశ్, రాజేశ్వర్, జుగాది రావ్, విజయ్, భీంరావ్, శ్రీనివాస్, భీముడు, లింగు, సోమేశ్వర్ ఉన్నారు.

ఆలయ కమిటీ ఎన్నిక

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ పట్టణ శివారులోని బేల్లూరి అయ్యప్ప స్వామి ఆలయం కమిటీ సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కుంబోజి సూర్యకాంత్, రవీందర్ మాట్లాడుతూ.. ఇప్పటి వరకు జరిగిన కార్యక్రమాలపై చర్చించడం జరిగిందన్నారు. అనంతరం ఆలయ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కుంబోజి సూర్యకాంత్, రవీందర్, కోశాధికారిగా నరేశ్‌లను ఎన్నుకున్నారు. నాయకులు దారట్ల జీవన్, అనిల్ దేశ్ పాండే, శ్రీనివాస్, ఈర్ల సత్యనారాయణ, దిలీప్, గణేశ్ పాల్గొన్నారు.

జీఆర్ కుర్మేకు కవుల పరామర్శ

నేరడిగొండ: మండలానికి చెందిన ప్రముఖ కవి జీఆర్ కుర్మేను కవులు పరామర్శించారు. ఆయన అనారోగ్యం బారిన పడడంతో శనివారం తెలంగాణ రచయితల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉదారి నారాయణ, జిల్లా అధ్యక్షుడు బాలసాని లక్ష్మీనారాయణ గౌడ్, కవులు ప్రశాంత్, సత్యనారాయణ, గడ్డం భీంరెడ్డి, మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు అల్లూరి భూమన్నలు పరామర్శించారు. ఇదిలా ఉండగా ఉదారి నారాయణ రచించిన 'మళ్లీ మనిషిలోకి కవిత సంకలన్ని' జీఆర్ కుర్మేకు అందజేశారు.

ముగిసిన సప్తాహం

కుభీర్: మండలంలోని పార్డి(కె) గ్రామంలో గతవారం రోజులుగా కొనసాగుతున్న తాళ సప్తాహం శనివారంతో ముగిసింది. రాజరాజేశ్వర మందిరంలో భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగాయి. అనంతరం శోభాయాత్ర నిర్వహించారు. ఇందులో కుభీర్, కస్రా, జామ్‌గాం, రంజని, పల్సి గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి

పెంబి: సమయపాలన పాటించని పెంబి పీహెచ్‌సీ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని సీపీఎం (ఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యవర్గ సభ్యుడు మంచికంటి లక్ష్మణ్ డిమాండ్ చేశారు. శనివారం ఉదయం 11గంటలు దాటిన సిబ్బంది లేకపోవడంతో రోగులు.. లక్ష్మణ్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే అక్కడికి చేరుకుని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులు ఉండాలని, కాని ఒకరు కూడా రెగ్యులర్ లేరన్నారు. ఆరుగురు స్టాఫ్‌నర్సులు ఉండాల్సి ఉండగా ఒకరు లేకపోవడంతో రోగులు ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్తున్నారని తెలిపారు. సమయపాలన పాటించని సిబ్బందిపై చర్యలు తీసుకోని, సరిపడా వైద్యులను నియమించాలని కోరారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

లక్ష్మణచాంద: ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని నిర్మల్ ఆర్టీసీ డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని రాచాపూర్ సమీపంలో రోడ్డు భద్రతా నియమాలపై శనివారం వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాహనదారులు హెల్మెట్ ధరించడం, సీటు బెల్టు పెట్టుకోవడం తదితర రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తే ప్రమాదాలు జరగవన్నారు. ఆర్టీసీ బస్సులోనే ప్రయాణం సురక్షితమన్నారు. ఏఎస్సై బి.నారాయణరెడ్డి, హెడ్ కానిస్టేబుళ్లు శంకర్, వాహిద్, కానిస్టేబుల్ అశోక్, ఆర్టీసీ సిబ్బంది రమణ, దేగం భాస్కర్ పాల్గొన్నారు.







దీపావళి సందడి

దీపావళి పండుగ సందర్భంగా జిల్లా కేంద్రం శనివారం జనంతో కళకళలాడింది. హిందువులకు పెద్ద పండుగ కావడం.. జిల్లా కేంద్రంలో వారసంత ఉండడంతో మార్కెట్‌లో ప్రజలు బారులు తీరారు. కలర్లకు సంబంధించిన ముగ్గు పిండి, బంతి పూలు, వివిధ రకాల ప్రమిదలు, టపాసులు, పండుగ సామగ్రి కొనుగోలు కోసం ఆయా గ్రామాల నుంచి పెద్దఎత్తున ప్రజలు తరలివచ్చారు.

– ఆసిఫాబాద్‌రూరల్



నేడు ఆలయంలో ధనలక్ష్మీ పూజలు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని షిర్డీసాయి మందిరంలో దీపావళి పర్వదినం పురస్కరించుకొని ఆదివారం ఉదయం 10 గంటలకు ధనలక్ష్మీ, సరస్వతి పూజలు నిర్వహిస్తున్నట్లు అర్చకులు ఇందారపు మధూకర శర్మ తెలిపారు. కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

ఆలయాలు ముస్తాబు



విద్యుత్ వెలుగుల్లో శివాలయం

కౌటాల: దీపావళి పండుగ పురస్కరించుకొని మండల కేంద్రంలోని సదాశివపేటలో గల శివాలయాన్ని విద్యుత్ దీపాలతో ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు అలంకరించారు. ఆలయంలో పూజలు చేసేందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులు సైతం తమ ఇళ్లను శుభ్రం చేసి విద్యుత్ దీపాలతో అలంకరించారు. మండల కేంద్రంలో పూలు, దీపాలను కొనుగోలు చేస్తూ ప్రజలు సందడి చేశారు.

అభివృద్ధికి దూరంగా 'ఎనగోంది'

- అంతర్గత సీసీరోడ్లు కరువు
- రహదారిపైనే పారుతున్న వృథా నీరు
- శిథిలావస్థకు పాఠశాల భవనం
- వాగు పొంగితే బయటి ప్రపంచానికి దూరం



శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనం



ఎనగోందికి వెళ్లే దారి మధ్యలో వాగు

వాంకిడి: మండలంలోని దొడ్డిగూడ గ్రామపంచాయతీ పరిధిలో గల ఎనగోంది గ్రామం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. గ్రామంలో కనీస మౌలిక సదుపాయాలు లేక గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. భారీ వర్షాలు కురిసిన ప్రతీసారి గ్రామ సమీపంలోని వాగు ఉప్పొంగడంతో బయటి ప్రపంచానికి దూరమవుతున్నారు.

రాజ్యమేలుతున్న సమస్యలు..

గ్రామంలో సుమారు 70 కుటుంబాలు నివాసముంటున్నాయి. కానీ ఏళ్లుగా ఆ గ్రామం మాత్రం అభివృద్ధికి నోచుకోవడం లేదు. గ్రామంలో మౌలిక సదుపాయాలు తాగునీరు, విద్యా, వైద్యం, సరైన రహదారి వంటి సౌకర్యాలు కూడా లేవు. గ్రామంలో తాగునీటి కోసం ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ ట్యాంకు, పైపులైను నిరుపయోగంగా మారాయి. ఇంటింటికీ వేసిన నల్లాలు సగానికి పైగా పనిచేయడం లేదు. గ్రామంలో మూడు బోరింగులు ఉన్నా ఒక్క బోరింగు నీరు మాత్రమే తాగేందుకు వీలుగా ఉన్నాయి. బోరింగు పాడైన ప్రతీసారి తాగునీటికి చాలా కష్టపడాల్సి వస్తుందని గ్రామస్తులు వాపోతున్నారు. సీసీరోడ్లు, మురికి కాలువలు లేని కారణంగా బోరింగుల ద్వారా వచ్చే వృథా నీరు అంతర్గత రహదారిపైనే పారుతుంది. అత్యవసర సమయాల్లో వైద్యసేవల నిమిత్తం గ్రామం దాటాలంటే గ్రామ సమీపంలోని వాగు దాటాల్సి ఉంటుంది. వానాకాలంలో వాగు ఉధృతంగా ప్రవహించినా ప్రాణాలకు తెగించి మరీ గ్రామస్తులు వాగులో నుంచే రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి ఉంది. వర్షాకాలంలో పాఠశాలకు ఉపాధ్యాయుడు రావాలన్నా సాహసం చేయక తప్పడం లేదు. పాఠశాలలో సుమారు 30 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. కానీ పాఠశాల భవనం మాత్రం ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితిలో ఉంది.

వంతెన నిర్మాణ హామీ గాలికి..

దొడ్డిగూడ గ్రామంలో నాలుగు వరుసల రహదారి నిర్మాణ యాజమాన్యం డీబీఎల్ కంపెనీ కంకర క్రషర్‌ను ఏర్పాటు చేసింది. దీనికిముందు గ్రామ పంచాయతీ కేంద్రంతో పాటు ఎనగొంది గ్రామంలోనూ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతామని గ్రామసభ తీర్మానంలో రాసి ఇచ్చారు. కంపెనీ ఇచ్చిన హామీలో ఒకటైన ఎనగోంది గ్రామానికి వెళ్లే రహదారిపై గల వాగుపై వంతెన నిర్మించాల్సి ఉంది. కానీ కంకర క్రషర్ ఏర్పాటు చేసి ఏళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు పనులు ప్రారంభించలేదు.

తాగునీటికి తిప్పలు



గ్రామంలో ఇంటింటికి ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ నల్లాలు సగానికి పైగా నిరుపయోగంగా మారాయి. నాలుగైదు నల్లాల్లో మాత్రమే కొంతసేపు నీళ్లు వస్తాయి. గ్రామంలోని బోరింగులు పాడైతే రెండు, మూడు రోజులపాటు తాగునీటి కోసం చాలా కష్టపడాల్సి వస్తుంది. అధికారులు దృష్టి సారించి నల్లాల ద్వారా నీరు అందించాలి.

– అన్నుబాయి, ఎనగోంది

హామీలన్నీ గాలికి..



పంచాయతీ కేంద్రం దొడ్డిగూడలో నాలుగు వరుసల రహదారి నిర్మాణానికి సంబంధించిన కంకర క్రషర్ ఏర్పాటు చేశారు. ఆ సమయంలో దొడ్డిగూడతో పాటు మా గ్రామంలోనూ అభివృద్ధి పనులు చేపడతామని హామీ పత్రాలు రాసి ఇచ్చారు. కానీ ఇప్పటికి ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేదు. వాగుపై వంతెన, సీసీరోడ్లు నిర్మించాలి. ఎన్నిసార్లు అడిగిన పనులు ప్రారంభించడం లేదు.

– మానిక్‌రావు, ఎనగోంది

టీకాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలి



రికార్డులు పరిశీలిస్తున్న హెచ్‌ఈవో రవిదాస్

వాంకిడి: ప్రభుత్వం నుంచి పంపిణీ చేస్తున్న టీకాలపై గర్భిణులు, బాలింతలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని వైద్యవిస్తరణ అధికారి పెందుర్ రవిదాస్ సూచించారు. శనివారం మండలంలోని నార్లాపూర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి పలు సూచనలు చేశారు. గర్భిణులు, బాలింతలతో పాటు పిల్లలకు అందుతున్న పౌష్టికాహారం, వారికి సూచించాల్సిన అంశాలపై అవగాహన కల్పించారు. పిల్లల్లో పోషకాహార లోపం లేకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో ఏఎన్ఎమ్ కృష్ణకుమారి, అంగన్‌వాడీ టీచర్ లక్ష్మి, ఆశ వర్కర్ రోజా తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు



స్వాధీనం చేసుకున్న గుడుంబాతో పోలీసులు

సిర్పూర్(టి): మండలంలోని చింతకుంట గ్రామంలోని గుడుంబా స్థావరాలపై శనివారం ఎక్సైజ్ సీఐ మంగమ్మ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా నిల్వఉంచిన గుడుంబా, బెల్లం పానకంతో పాటు బెల్టుషాపుల్లో అక్రమంగా నిల్వఉంచిన మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ మంగమ్మ తెలిపారు. 2500 లీటర్ల బెల్లం పానకం, 15 లీటర్ల గుడుంబా, 8 మద్యం క్వార్టర్లు స్వాధీనం చేసుకొని చింతకుంట గ్రామానికి చెందిన బానోత్ రత్నబాయ్, మధదర్ మండల్‌లపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ఏజెన్సీలో కనిపించని వెలుగులు



కెరమెరి: వెలవెలబోతున్న వస్త్ర దుకాణం

- వెలవెలబోతున్న వస్త్ర దుకాణాలు
- మార్కెట్‌కు పత్తి రాక ఖాళీగా రైతుల జేబులు
- ఏజెన్సీ మండలాల్లో విపత్కర పరిస్థితి

కెరమెరి: దీపావళి పండుగ వచ్చిందంటే మండల కేంద్రంలోని వస్త్ర దుకాణాలు రద్దీగా ఉండేవి. కానీ ఈ ఏడాది ఏజెన్సీ మండలాల్లో సందడి కనిపించడం లేదు. ఏజెన్సీ మండలాలు కెరమెరి, జైనూర్, సిర్పూర్(యూ), లింగాపూర్, తిర్యాణి మండలాల్లో కరువు ప్రభావం పండుగపై పడింది. ఆయా మండలాల్లో అధిక జనాభా వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. కాగా ఇప్పటికీ పత్తి పంట మార్కెట్‌కు రాకపోవడంతో డబ్బులు లేక రైతుల జేబులు ఖాళీగా ఉన్నాయి. దీంతో ఆయా మండలాల్లోని కిరాణా దుకాణాలు, వస్త్ర దుకాణాలు కొనుగోలుదారులు లేక వెలవెలబోతున్నాయి.

దెబ్బతిన్న గిరాకీ..

గతంలో దీపావళి పండుగకు వివిధ రకాల దుస్తుల కోసం భారీగా వచ్చే జనం రద్దీ ఈ ఏడాది బాగా తగ్గింది. దీంతో గిరాకీ లేక వ్యాపారస్తులు ఆందోళన చెందుతున్నారు. గతంలో దీపావళి సీజన్‌లో రోజుకు రూ.లక్షల్లో అయ్యే గిరాకీ ఈసారి రూ.వేలల్లో కూడా కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పత్తి మార్కెట్‌లోకి రాకపోవడంతో..

ఐదు మండలాల్లో ప్రతి సంవత్సరం దసరా నుంచే మార్కెట్‌లోకి పత్తి పంట వచ్చేది. కానీ ఈసారి దీపావళి వచ్చినా పత్తి పంట కనిపించడం లేదు. వర్షాల కారణంగా ఇంకా పత్తి పంట మార్కెట్లోకి రాకపోవడంతో రైతుల జేబులు ఖాళీగా ఉన్నాయి. మొదటి విడతలోనే 20, 30 క్వింటాళ్ల వరకు పత్తి దిగుబడి వచ్చేది. కానీ ఈసారి అనుకున్న స్థాయిలో పత్తి పంట రాలేదు. దీంతో రైతులు కోలుకోలేని పరిస్థితిలో ఉండడంతో వ్యాపారాలు సాగడం లేదని వ్యాపారులు చెబుతున్నారు.

దీపావళి సంబురం లేదు



గతంలో మాదిరి దీపావళి సంబురాలు ఈ ఏడాది కన్పించడం లేదు. ఇప్పటి వరకు కిలో పత్తి కూడా తీయలేదు. ఉన్న డబ్బులన్నీ పంటల సాగు పెట్టుబడికే ఖర్చు చేశాం. ఈ ఏడాది వానల కారణంగా పత్తి పంట ఇంకా చేతికి రాకపోవడంతో పిల్లలకు బట్టలు కూడా కొనలేని పరిస్థితిలో ఉన్నాం.

– కౌటాడే బాలాజీ, ఇంద్రానగర్

పదిహేనేళ్ల తర్వాత..



పదిహేనేళ్ల తర్వాత ఇంతటి విపత్కర దీపావళి పండుగ చూస్తున్నాం. ప్రతి ఏడాది లక్షల రూపాయల్లో అయ్యే గిరాకీ ఈ ఏడాది వేల రూపాయల్లో కూడా అవడం లేదు. ఎంతో కొంత జనం దుకాణానికి వచ్చినా తక్కువ ధర కలిగిన బట్టలు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు.

– షేక్ రబ్బానీ, వ్యాపారస్తుడు, కెరమెరి

'గిరి' గ్రామాల్లో దండారీ కోలాహలం

గిరిజన సంప్రదాయం, ఆచార వ్యవహారాలతో మండలంలోని సాకడ(ఏ), సాకడ(బి)లో శనివారం నిర్వహించిన దండారీ వేడుకలు ఆకట్టుకున్నాయి. కాళ్లకు గజ్జెలు కట్టి గుస్సాడీలు చేసిన నృత్యాలు కనుల విందు చేశాయి. మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన దండారీకి సాకడ(ఏ) గ్రామస్తులు ఆతిథ్యమివ్వగా, సిర్పూర్ (యూ) మండలంలోని చింతకర్ర గ్రామానికి చెందిన దండారీకి సాకడ(బి) గ్రామస్తులు ఆతిథ్యమిచ్చారు. ఈ సందర్భంగా సామాజిక, సాంఘిక అంశాలతో పాటు వినోదంతో కూడిన నాటికల ప్రదర్శనలు చేశారు. ఎంపీపీ మోతిరాం ఏత్మాసార్ పేన్‌కు పూజలు చేశారు. సాకడ(బి)లో అంబాజీరావు, తుకారం, మోతిరాం, దండేరావు, బీర్‌శావ్, భగవంత్‌రావు, సోంజీ, జైతు, దత్తు, దేవ్‌రావు, సాకడ(ఏ)లో సోంజీ, లచ్చు, శంకర్, మెంగు, లింగు, సింగు, బిలాజీరావు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

– కెరమెరి



సాకడ(ఏ)లో నృత్యం చేస్తున్న గుస్సాడీలు



సాకడ(బి)లో ..



సాకడ(ఏ)లో నాటిక ప్రదర్శిస్తున్న కళాకారులు



సాకడ(బి)లో నృత్యం చేస్తున్న దండారీ

మాదిగల విశ్వరూప సభకు తరలిన నాయకులు

బోథ్: సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో శనివారం నిర్వహించిన మాదిగ విశ్వరూప సభకు మండలం నుంచి ఎమ్మార్పీఎస్ నాయకులు భారీగా తరలివెళ్లారు. మందకృష్ణ మాదిగ అధ్యక్షతన జరిగే సభకు ప్రధాని మోదీ రానుండటం, వర్గీకరణ ప్రకటనపై ఆశాభావం వ్యక్తం చేశారు. సభకు తరలిన వారిలో జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెపు గణేశ్, మండల అధ్యక్షుడు అడ్డిగ స్వామి, పట్టణ అధ్యక్షుడు రవి, దాసరి గంగయ్య, పాలెపు గోపి, కొంకటి గంగాధర్, రాజేశ్వర్, రవీందర్, నల్ల చిన్నయ్య, అన్నెపాక అశోక్, పంచాక్షరీ పాల్గొన్నారు.

అబుల్ కలాం ఆజాద్ సేవలు చిరస్మరణీయం

ఆదిలాబాద్‌టౌన్: దేశ ప్రథమ విద్యాశాఖ మంత్రిగా మౌలానా అబుల్ కలాం అందించిన సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని శనివారం బీఆర్ఎస్ కార్యాలయంలో నేషనల్ ఎడ్యుకేషన్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహనీయుల ఆశయాలను సాధించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి విశేష ప్రాధాన్యత ఇస్తుందన్నారు. కార్యక్రమంలో సాజిదోద్దీన్, అష్రఫ్, పర్వీన్ పాల్గొన్నారు.

ఆదివాసీలకు బ్లాంకెట్లు అందజేత



ఆదివాసీలకు అందజేసిన బ్లాంకెట్లతో లతాజెట్టి

కెరమెరి: మండలంలోని కొఠారి గ్రామంలో శనివారం మంచిర్యాలకు చెందిన ఏకే ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫౌండర్ లతాజెట్టి ఆదివాసీలకు 100 బ్లాంకెట్లు (దుప్పట్లు) ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రానున్న రోజుల్లో చలితీవ్రత పెరగనున్న నేపథ్యంలో పేదలకు సేవ చేయాలన్న దృక్పథంతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గుణవంత్‌రావు, సామాజిక కార్యకర్త బండేరావు, గ్రామస్తులు ఉన్నారు.